సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



ఉద్యోగులకు క్రీడలు..
డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని టీఎన్జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు.
- 8లో ▸



అద్దె భవనాలే దిక్కు..
జిల్లాలో ఐదు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, ఆర్మూర్ కార్యాలయం మాత్రమే పక్కా భవనంలో కొనసాగుతోంది.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /22.7
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను గురువారం ప్రారంభించారు. వెయ్యి క్యూసెక్కుల నీటిని ఆయకట్టు పంటల కోసం వదులుతున్నారు. ఆయకట్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు రెండో విడత నీటి విడుదల చేపట్టారు. మొదటి విడతలో జూన్ నెలలో ఆయకట్టుకు 1.2 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1405 అడుగులు(17.8 టీఎంసీలు) గాను ప్రస్తుతం 1391.80 అడుగులు(4.875 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలి



రుద్రూర్: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి సూచించారు. కోటగిరి మండలం కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను న్యాయమూర్తి గురువారం సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు కారంతో భోజనం ఇచ్చారని గతంలో ఫిర్యాదులు రావడంతో స్కూల్‌లో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం మధ్యాహ్న భోజనం ఫండ్స్‌ను పెంచాల్సిన అవసరం ఉందని, ఈవ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. న్యాయమూర్తి వెంట హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఉన్నారు. అంతకు ముందు ఎక్లాస్‌పూర్‌లోని గుమ్మడి ఫౌండేషన్ అనాథ ఆశ్రమాన్ని న్యాయమూర్తి సందర్శించి పిల్లలతో మాట్లాడారు. వారి విద్యా ప్రగతిని తెలుసుకుని వారితో కలిసి ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. ఆశ్రమం ఇన్‌చార్జి మధు, సిబ్బంది ఉన్నారు.

'భగీరథ' నీళ్లు బంద్

నిజాంసాగర్: సంగారెడ్డి జిల్లాలోని మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ప్రధాన పైపులైన్ల లీకేజీతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు భగీరథ నీటి సరఫరా నిలిచిపోనుంది. ప్రధాన పైపులైన్ల మరమ్మతులతో నీటి సరఫరా బంద్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో బోరు మోటార్ల ద్వారా ట్యాంకులను నింపాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని 799 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో గ్రామ పంచాయతీల్లో బోర్లు, సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నారు.

పక్కా స్కెచ్

భూమి బదిలీ పేరిట అక్రమం
- రూ.కోట్ల విలువైన పార్క్ స్థలం కొట్టేసేందుకు ప్లాన్
- నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం
- 2019 లోక్‌సభ ఎన్నికల కోడ్ సమయంలో తతంగాన్ని నడిపించిన అధికారులు
- మున్సిపల్ రెవెన్యూ అధికారి నరేందర్ ఏసీబీకి చిక్కితే గానీ వివరాలు బయటకు రాని వైనం
- పార్క్ మైదానం చుట్టూ ప్రహరీ కట్టేందుకు మంజూరైన రూ.15 లక్షలు హాంఫట్
- ఏసీబీ డీజీ, సీడీఎంఏ జేడీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకుడు

రూ. కోట్ల విలువ చేసే నగరంలోని మున్సిపల్ పార్క్ స్థలాన్ని మింగేసేందుకు కౌన్సిల్‌నే తప్పుదోవ పట్టించారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలోనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి గతంలో తిరస్కరించిన ప్రతిపాదన మళ్లీ ఎజెండాలో చేర్చి ఆమోదం పొందేలా చేసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారం నడిపించడంలో అప్పటి మున్సిపల్ కమిషనర్‌తోపాటు మరికొందరు అధికారులు, అప్పటి డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ ఉండటం విశేషం..



ఖోజా కాలనీలోని మున్సిపల్ పార్క్ స్థలం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : హైడ్రా.. హైడ్రా.. ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజల నోళ్లలో నానుతున్న పేరు. ఈ హైడ్రా తాజాగా గురువారం తీసుకున్న నిర్ణయం అధికారుల్లో గుబులు రేపుతోంది. హైడ్రా పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కేసులు పెట్టేందుకు సైతం రంగం సిద్ధం చేసింది.

ఈ నేపథ్యంలో నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో గతంలో ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో పార్క్ భూమిని మింగేసేందుకు కౌన్సిల్‌నే తప్పుదోవ పట్టించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమ వ్యవహారాన్ని ఒక క్రమపద్ధతి ప్రకారం నడపడం గమనార్హం. ఇటీవల మున్సిపల్ రెవెన్యూ అధికారి నరేందర్ ఏసీబీకి చిక్కడంతో ఇప్పటివరకు తొక్కిపెట్టిన ఈ అక్రమానికి సంబంధించిన ఫైల్ బయటకు వచ్చింది. మొత్తం వ్యవహారాన్ని అప్పటి నగరపాలక కమిషనర్ జాన్ శ్యాంసన్, డీసీపీ జలంధర్‌రెడ్డి, ఏసీపీ శ్యాంకుమార్, టీపీవో కరుణాకర్‌లు ఈ కథను నడపడం విశేషం. అప్పటి డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ హస్తం సైతం ఉండడం గమనార్హం.

2019 లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మరీ గతంలో తిరస్కరించిన ప్రతిపాదన మళ్లీ ఎజెండాలో పొందుపరిచి ఆమోదం పొందేలా చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని బోధన్ రోడ్డులో రూ.కోట్ల విలువైన మున్సిపల్ పార్క్ స్థలాన్ని కొట్టేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఖోజా కాలనీలోని ప్లాటినం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వద్ద 2,666.88 చదరపు గజాల భూమిని మింగేసేందుకు గాను అప్పటి కమిషనర్ జాన్‌శ్యాంసన్ పకడ్బందీగా పావులు కదపడం గమనార్హం. కాగా అప్పటికే బోధన్ రోడ్డులోని మైనారిటీ ప్రాంతాల్లో పార్కులు, ఆటస్థలాలు, కమ్యూనిటీ భవనాలు, ఓపెన్ జిమ్‌లు, ఆరోగ్య కేంద్రాలు, గ్రంథాలయాలు ఒక్కటి కూడా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఖోజా కాలనీలో ఉన్న విలువైన మున్సిపల్ కార్పొరేషన్ మైదానాన్ని నిబంధనలకు విరుద్ధంగా భూమి బదిలీ కోసం రంగం సిద్ధం చేయడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒకసారి తిరస్కరించినా..

1993 నుంచి ఇలాగే వదిలేశారు..

ఖోజా కాలనీలో ఈ 2,666.88 చదరపు గజాల స్థలాన్ని లేఅవుట్ పార్క్ స్థలంగా కేటాయించారు. అప్పటి నుంచి దీన్ని ఇలాగే వదిలేశారు. ప్రస్తుతం ఇక్కడ చదరపు గజం రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ఉన్నట్లు అంచనా. కాగా ఈ మైదానం చుట్టూ ప్రహరీ గోడ కట్టేందుకు గాను 13వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధుల్లో రూ.15 లక్షలు కేటాయించారు. ఆర్థిక సంఘం నుంచి మొత్తం 25 చోట్ల వివిధ పనులకు సంబంధించి నిధులు కేటాయించినట్లు కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. ఇందుకు సంబంధించి మిగిలిన 24 చోట్ల పనులు పూర్తి చేయగా, ఈ ఒక్క చోట మాత్రం ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణ పనులు చేయలేదు. ఇందుకోసం కేటాయించిన రూ.15 లక్షల నిధులు సైతం హాంఫట్ కావడం విశేషం. కాగా 2016 ఆగస్టు 27న అప్పటికే నిర్మాణం పూర్తయిన ప్లాటినం హౌసింగ్ సొసైటీ మసీదు కోసం ఈ స్థలాన్ని కేటాయించేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో భూమి బదిలీ ప్రతిపాదన పెట్టారు. బదులుగా ప్రాధాన్యత లేని చోట స్థలం ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో కౌన్సిల్ అప్పటి కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖైసర్ ఈ భూమి బదిలీ ప్రతిపాదనను వ్యతిరేకించారు. దీంతో తిరస్కరణకు గురైంది. ఇదిలా ఉండగా మరోసారి 2019 ఫిబ్రవరి 5న భూమి బదిలీ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కౌన్సిల్‌లో పెట్టారు. 2019 ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో భూమి బదిలీ చేస్తూ తీర్మానం చేశారు. కాగా సయ్యద్ ఖైసర్ అప్పటి సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) సత్యనారాయణకు 2019 జూన్ 10న ఫిర్యాదు చేశారు. దీంతో ఈ భూమి బదిలీ ప్రక్రియకు బ్రేక్ పడింది. మళ్లీ ఇప్పుడు తతంగం పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేస్తుండడం పట్ల పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తున్నారు. తాజాగా బుధవారం కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖైసర్ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌కు, సీడీఎంఏ జేడీ నారాయణకు ఫిర్యాదు చేశారు.

బదిలీ చేయడం చట్టవిరుద్ధం



మున్సిపల్ పార్క్, స్కూల్, హాస్పిటల్ స్థలాన్ని బదిలీ చేయడం చట్టవిరుద్ధం. ఈ స్థలాన్ని మైనారిటీల క్రీడా స్థలం కోసం ఉపయోగించాలి. విద్య, వైద్య అవసరాలకు తప్ప ప్రభుత్వ స్థలాన్ని ఇతర అవసరాలకు బదిలీ చేయకూడదు. మాజీ డిప్యూటీ మేయర్ ఎంఏ ఫహీమ్, మాజీ కార్పొరేటర్ రియాజ్, కొందరు బీఆర్‌ఎస్ నాయకులు కలిసి భూమిని కొట్టేసేందుకు డ్రామాలు చేశారు. మళ్లీ ఇప్పుడు కూడా ఈ స్థలాన్ని మింగేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీన్ని చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. అవసరమైతే న్యాయపోరాటానికి దిగుతాం. తక్షణమే 2014లో మంజూరైన రూ.15 లక్షల నిధులతో ఈ స్థలానికి ప్రహరీ నిర్మించాలి.

– సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ నాయకుడు

ఎన్నికలకు సమాయత్తం కావాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన అదనపు కలెక్టర్ అంకిత్, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి పార్థసారథి సూచించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఆయన మాట్లాడారు. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ చట్టం–2018తోపాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎంపీడీవోలు పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించేలా చూడాలని ఆదేశించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయాలతోపా టు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్‌లను నెలకొల్పి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, జెడ్పీ సీఈవో ఉష, డీపీవో తరుణ్‌కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వెట్టి చాకిరీ..

- 30 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన కొనసాగుతున్న రెండో ఏఎన్‌ఎంలు
- రెగ్యులరైజ్ కోసం ఎదురుచూపులు



నిజామాబాద్‌నాగారం : వైద్యారోగ్యశాఖ పరిధిలో 30 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎమ్‌ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఉద్యోగ భద్రత లేకపోగా, చాలీచాలని వేతనాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. దశల వారీగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాల్సి ఉండగా, పట్టించుకునే వారు కరువయ్యారు.

వైద్యారోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఆరోగ్య ఉపకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండో ఏఎన్‌ఎంలను కాంట్రాక్టు పద్ధతిన నియమించగా, 2001 నుంచి ప్రతి ఏడాది దశల వారీగా ఈ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో 70శాతం మందిని రెగ్యులర్ చేయగా, 2009 తర్వాత రెగ్యులర్ ప్రక్రియ నిలిచిపోయింది. నాటి నుంచి నేటి వరకు రెండో ఏఎన్‌ఎంలు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిరసనలు తెలుపుతూనే ఉన్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం జిల్లాలో ఇద్దరు ఓపీ ఎఎన్‌ఎంలను మాత్రమే రెగ్యులర్ చేసింది. ప్రస్తుతం జిల్లాలో 480మంది రెండో ఏఎన్‌ఎంలు, 40మంది పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఏఎన్‌ఎంలు ఉన్నారు. వీరంతా రెగ్యులర్ వారితో సమానంగా విధులను నిర్వర్తిస్తున్నారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు గ్రామాలు ఉంటే రెండు గ్రామాలు రెగ్యులర్, మరో రెండు గ్రామాల బాధ్యలను కాంట్రాక్టు ఎఎన్‌ఎంలకు కేటాయించారు. అయతే వీరి మధ్య వేతన వ్యత్యాసం మాత్రం చాలా ఉంది. తమకు నెలకు అందిస్తున్న రూ.28వేల వేతనం సరిపోవడం లేదని రెండో ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వయస్సు పైబడుతోందని, వెంటనే రెగ్యులర్ చేస్తే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

అమలుకాని ప్రభుత్వ హామీ



రెగ్యులర్ ఏఎన్‌ఎంలతో సమానంగా కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాం. అయినా ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. కాంట్రాక్ట్ రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలు చేయడం లేదు. కనీసం సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. ఇకనైనా రెగ్యులర్ చేయాలి.

– పద్మ, రెండో ఏఎన్‌ఎం, భీమ్‌గల్

ఆందోళన చేసినా ఫలితం లేదు



ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నాం. అయినా మా సమస్యలను పట్టించుకోవడం లేదు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలతో సమానంగా విధులు కేటాయించినప్పుడు సమాన గుర్తింపు ఇవ్వడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు మమ్మల్ని గుర్తించి రెగ్యులర్ చేసి ఆదుకోవాలి.

– సంధ్య, రెండో ఏఎన్‌ఎం, నిజామాబాద్

నగరంపై డెంగీ పంజా

- ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన కేసులు 136.. ఆగస్టులోనే 81



పట్టణ ప్రకృతి వనంలోని మొక్కలకు నీళ్లు పట్టేందుకోసం ఈ నీటి కుండీని(తొట్టి) నగరంలోని కోటగల్లీ శంకర్‌భవన్ పాఠశాల ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. కుండీలో రోజులతరబడి నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా డెంగీ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే కొంత మంది విద్యార్థులు జ్వరాలబారిన పడ్డారు. 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలోనూ అధికారులకు ఈ కుండీ కనిపించకపోవడం గమనార్హం.

నిజామాబాద్‌అర్బన్: నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డెంగీ విజృంభిస్తోంది. జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల్లో అత్యధికంగా నిజామాబాద్ అర్బన్‌లోనే ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్‌లు ఉండగా, సుమారు నాలుగు లక్షల జనాభా, 75 వేలకు పైగా నివాస గృహాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో నీటి నిలువ, డ్రైనేజీలు, మురికి కాలువల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మున్సిపల్ కార్పొరేషన్ సేవలు నామమాత్రంగా ఉండటం, ఫ్రైడే డ్రైడే తూతూమంత్రంగా కొనసాగడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరం పరిధిలో ఈ ఏడాది నమోదైన డెంగీ కేసుల వివరాలను పరిశీలిస్తే.. ఈ ఏడాది ఇప్పటి వరకు నగరంలో మొత్తం 136 డెంగీ కేసులు నమోదు కాగా, ఒక్క ఆగస్టులోనే 81 మంది డెంగీ బారినపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 425 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన, పొందుతున్న వారి వివరాలు సక్రమంగా నమోదు కావడం లేదు.

క్షేత్రస్థాయిలో నామమాత్రపు సేవలు

కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ 1200 మంది శానిటేషన్ సిబ్బంది ఆయా డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. ఆయా డివిజన్‌లలో కల్వర్టులు, మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతోపాటు ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు నిలుస్తుండడంతో దోమల బెడద పెరుగుతోంది. మరోవైపు వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతి శుక్ర, మంగళవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే, ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఏమాత్రం ఫలితాన్ని ఇవ్వడం లేదనేందుకు నమోదవుతున్న డెంగీ కేసులే నిదర్శనమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అర్సపల్లి, హైమద్‌పురా కాలనీ, వినాయకనగర్, సీతారాంనగర్ కాలనీ, ముబారక్‌నగర్, పాముల బస్తీ, నాందేవ్‌వాడ, సుభాష్‌నగర్, మిర్చీ కాంపౌండ్ , పెద్దబజార్, కోటగల్లి ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువ నమోదవుతున్నాయి. ముఖ్యంగా ముబారక్‌నగర్, ఎల్లమ్మగుట్ట, వినాయక్‌నగర్, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది. ఒక్క ఆగస్టు నెలలోనే డెంగీ కేసుల సంఖ్య విపరీతంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

నగరంలోని ఆయా డివిజన్‌లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతను పకడ్బందీగా చేపడుతాం. మురికి కాల్వలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి దోమల బెడద పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– శంకర్, మున్సిపల్ అదనపు కమిషనర్

ఆరోగ్య కేంద్రం	నెల	డెంగీ కేసులు
అర్సపల్లి	జనవరి	06
	ఫిబ్రవరి	01
	జూన్	01
	జులై	12
	ఆగస్టు	21
మాలపల్లి	జనవరి	02
	ఫిబ్రవరి	01
	మార్చి	02
	జులై	01
	ఆగస్టు	03
దుబ్బ	ఫిబ్రవరి	01
	జూన్	02
	జులై	03
	ఆగస్టు	09
సీతారాంనగర్	జనవరి	02
	ఫిబ్రవరి	01
	మార్చి	03
	జులై	01
	ఆగస్టు	13
గౌతమ్‌నగర్	జనవరి	01
	జూన్	01
	జులై	03
	ఆగస్టు	14
చంద్రశేఖర్ కాలనీ	మే	01
	జులై	03
	ఆగస్టు	12
వినాయక్‌నగర్	జనవరి	04
	జూన్	01
	జులై	02
	ఆగస్టు	09

ఎల్లుండి నుంచి పశుగణన

- ప్రారంభం కానున్న 21వ జాతీయ పశుగణన
- ఐదేళ్లకోసారి పశు సంపద లెక్కింపు



మోర్తాడ్(బాల్కొండ): పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి పశు సంపద గణన ప్రారంభం కానుంది. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన చేపడుతుండగా, ప్రస్తుతం ప్రారంభం కానున్న 21వ జాతీయ పశుగణన డిసెంబర్ చివరి వరకు కొనసాగనుంది. ఇప్పటికే పశు వైద్యాధికారులు, సిబ్బందికి పశుగణనకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. గేదెలు, ఆవులు, ఎడ్లు, మేకలు, గొర్రెలు, కుక్కలు, పందులు ఇలా అన్ని రకాల పెంపుడు జంతువుల సంఖ్యను లెక్కించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. పశుగణన జరిగిన తరువాత పశుగణాభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించే అవకాశం ఉంది. బజార్లలో తిరిగే పశువుల సంఖ్యను కూడా లెక్కించే అవకాశం ఉంది. 19వ పశుగణనతో 20వ పశుగణనను పోలిస్తే జిల్లాలో 15 శాతం పశు సంపద పెరిగినట్లు వెల్లడైంది. గొర్రెల సబ్సిడీ పథకాన్ని అప్పట్లో అమలు చేయడంతో మేకలు, గొర్రెల సంఖ్య జిల్లాలో భారీగా పెరిగింది. ప్రస్తుతం పథకం నిలిచిపోగా, త్వరలో జీవాల లెక్క తేలనుంది.

2019లో పశుగణన లెక్కలు ఇలా

ఆవు జాతి పశువులు	1,01,258
గేదె జాతి పశువులు	2,06,898
గొర్రెలు	7,35,545
మేకలు	1,56,619
మొత్తం	12,00,320

ఎన్యుమరేటర్లతో పశుగణన

పశుగణన కోసం ఎన్యుమరేటర్లను నియమించాం. పశుసంవర్ధక శాఖలోని ఉద్యోగులే పశుగణన నిర్వహించనున్నారు. వారికి శిక్షణ ఇచ్చాం. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు నిరంతరాయంగా పశుగణన కొనసాగనుంది.

– డాక్టర్ రాజశేఖర్‌రావు, పశువైద్యాధికారి, కమ్మర్‌పల్లి

క్లుప్తంగా

ఉద్యోగులకు క్రీడలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని డిస్ట్రిక్‌ స్పోర్ట్స్‌ అథారిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమనీ టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్‌ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ మైదానంలో డీవైఎస్‌వో ఆధ్వర్యంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలుక కిషన్‌ మాట్లాడారు. ఉద్యోగులు పోటీల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. గెజిటెడ్‌ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సంగం అమత్‌ కుమార్‌, జిల్లా కార్యదర్శి హనుమంత్‌ రెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్‌, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రముఖ చార్టెడ్‌ అకౌంటెంట్‌ మృతి



ఆర్మూర్‌: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ప్రముఖ చార్టెడ్‌ అకౌంటెంట్‌ ఈరవత్రి రాజశేఖర్‌ తండ్రి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు ఈరవత్రి రాందాస్‌ గురువారం మృతిచెందారు. అంత్యక్రియలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సైనిక క్యాంపునకు విద్యార్థిని ఎంపిక



నిజామాబాద్‌అర్బన్‌: ఢిల్లీ-తల్‌ సైనిక్‌ క్యాంపునకు నిజామాబాద్‌ నగరంలోని కంఠేశ్వర్‌ ఉమెన్స్‌ కళాశాల బీఎస్సీ–బీజెసీఎస్‌ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్‌.సాత్విక ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్‌ కె.భారతీరెడ్డి తెలిపారు. ఎంపిక కావడానికి కళాశాలలో ఇచ్చే శిక్షణనే కారణమని ఎన్‌సీసీ ఏఎన్‌వో లుటినెంట్‌ కె.సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్‌ విద్యార్థులు సాత్వికకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్‌ వర్సిటీ ద్వారా నాణ్యమైన విద్య



నిజామాబాద్‌అర్బన్‌: అంబేద్కర్‌ ఓపెన్‌ వర్సిటీ ద్వారా నాణ్యమైన విద్య అందుతోందని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ రాష్ట్ర డైరెక్టర్‌ ఆనంద్‌ పవార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓపెన్‌ యూనివర్సిటీ ద్వారా ఆర్ట్స్‌, కామర్స్‌, సైన్స్‌, సోషల్‌ సైన్సెస్‌లలో వివిధ సర్టిఫికెట్‌, అండర్‌ గ్రాడ్యుయేట్‌, డిప్లొమా, పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ ప్రోగ్రాం కోసం ఈ ఏడాదికి అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఉద్యోగం, ఆర్థిక పరిస్థితులు, దూరభారం తదితర కారణాలవల్ల రెగ్యులర్‌ విద్యకు హాజరుకాలేని వారు ఓపెన్‌ విద్య ద్వారా సమానమైన విద్యను పొందవచ్చన్నారు.ప్రతి ఒక్కరికీ విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లాల్లో అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపల్‌ రామ్మోహన్‌రెడ్డి, యూనివర్సిటీ కోఆర్డినేటర్‌ రంజిత, రాధాకృష్ణ పాల్గొన్నారు.

అద్దె భవనాలే దిక్కా?

- ఐదు సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో ఒక్క ఆర్మూర్‌లోనే పక్కా భవనం
- డీఐజీ కార్యాలయం కూడా అద్దె భవనంలోనే..
- కనీస సౌకర్యాల్లేక క్రయవిక్రయదారులకు ఇక్కట్లు
- పక్కా భవనాల నిర్మాణంపై మంత్రి పొంగులేటి హామీ



అద్దె భవనంలో కొనసాగుతున్న నిజామాబాద్‌ అర్బన్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయం

సుభాష్‌నగర్‌: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న శాఖల్లో రిజిస్ట్రేషన్‌ శాఖ ప్రధానమైంది. ప్రతియేటా దాదాపు 40 వేలకుపైనే డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌ అవుతుండగా, రూ.130 కోట్లకుపైనే ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అవుతోంది. నిత్యం ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఈ కార్యాలయాల్లో జరుగుతున్నా.. సొంత భవనాలు, కనీస సౌకర్యాలు లేకపోవడంతో అటు ఉద్యోగులు.. ఇటు క్రయవిక్రయదారులు, డాక్యుమెంట్‌ రైటర్లు అవస్థలు పడుతున్నారు.

నిజామాబాద్‌ జిల్లాలో ఐదు సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు ఉండగా, ఒక్క ఆర్మూర్‌లో మాత్రమే పక్కా భవనంలో కొనసాగుతోంది. మిగతా నాలుగు సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. జిల్లాలో నిజామాబాద్‌ అర్బన్‌, నిజామాబాద్‌ రూరల్‌, ఆర్మూర్‌, బోధన్‌, భీంగల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కార్యాలయం కూడా ఉంది. ఆర్మూర్‌ మున్సిపాలిటీలో పదేళ్ల క్రితం సొంత భవనం నిర్మించారు. భీంగల్‌లో సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. డీఐజీ కార్యాలయం సహా నిజామాబాద్‌ రూరల్‌, బోధన్‌, భీంగల్‌, నిజామాబాద్‌ అర్బన్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. నిజామాబాద్‌ రూరల్‌, బోధన్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలకు స్థలాలు కేటాయించారు. స్థలాలు కేటాయించని కార్యాలయాలకు సైతం పంచాయతీ రాజ్‌, ఇతర ప్రభుత్వ స్థలాలు ఉంటే పక్కా భవనాలు రెండేళ్లలో నిర్మిస్తామని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీనిచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆదాయం దండి.. సౌకర్యాలు నిల్‌..

ఆదాయం దండిగా ఉన్నప్పటికీ.. గత ప్రభుత్వం పక్కా భవనాలపై దృష్టిసారించలేదు. అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే కొనసాగించింది. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ ఉద్యోగులు, క్రయ విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. నిజామాబాద్‌ అర్బన్‌, నిజామాబాద్‌ రూరల్‌, భీంగల్‌ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో క్రయవిక్రయదారులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేకపోతున్నారు.

పక్కా భవనాలకు మోక్షమెప్పుడో..?

ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్న శాఖ కార్యాలయాలు ఇతర కార్యాలయాలకు ఆదర్శంగా ఉండాలని, మోడల్‌గా తీర్చిదిద్దుతామని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతో సమీక్ష సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో సుమారు రూ.2 లక్షలకుపైనే సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలకు అద్దెలు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అందులో ఒక్క నిజామాబాద్‌ అర్బన్‌ కార్యాలయం సుమారు రూ.45వేలకుపైనే అద్దె చెల్లిస్తున్నారు. యజమానులకు అద్దె బకాయిలు కూడా ఉన్నట్లు సమాచారం.

క్రీడలతో మానసిక వికాసం



ధ్యాన్‌చంద్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్‌ యాదగిరి తదితరులు

నిజామాబాద్‌ రూరల్‌: క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ ఎం.యాదగిరి అన్నారు. జాతీయ క్రీడా దినాన్ని పురస్కరించుకుని గురువారం యూనివర్సిటీలో స్పోర్ట్స్‌ డైరెక్టర్‌ బాలకిషన్‌ ఆధ్వర్యంలో హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ.. భారతదేశంలో సైనికుడిగా కొనసాగిన ధ్యాన్‌ చంద్‌ అంతర్జాతీయంగా హాకీ క్రీడకు గుర్తింపు తేవడం భారతదేశానికే గర్వకారణమన్నారు. భారతదేశంలో క్రీడలకు మరింత గుర్తింపు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్‌ ఆరతి, చీఫ్‌ వార్డెన్‌ డాక్టర్‌ మహేందర్‌ రెడ్డి, పున్నయ్య, నేత నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్‌ కేంద్రం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, పోలీసులు, ఇతర అధికారులు

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని మున్సిపల్‌ కాంప్లెక్స్‌ భవనంలో కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌ను మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి సునీతా కుంచాల ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. రాజీ పడదగిన సమస్యల పరిష్కారానికి కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌ ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కుటుంబ, భూ తగాదాలు, ఆస్తి పంపకాలు వంటి సమస్యలతో పలువురు పోలీస్‌స్టేషన్‌లు, న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని ఇలాంటి తగాదాల పరిష్కారాల కోసమే ఈ కేంద్రం అని సూచించారు. ఇరు వర్గాలను ఒప్పించి, అవసరమైతే ఒకటికి రెండు సార్లు కౌన్సిలింగ్‌ నిర్వహించాలని న్యాయమూర్తి నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో మొదటిసారిగా ఈ కేంద్రాన్ని బోధన్‌లోనే ప్రారంభించారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా న్యాయమూర్తికి మొక్కలు అందజేసి సత్కరించారు. సీనియర్‌ సివిల్‌ న్యాయమూర్తి పద్మావతి, జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి రవికుమార్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి అజయ్‌కుమార్‌, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి పూజిత, అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి శివసాయి, స్పెషల్‌ జడ్జి శేషతల్పసాయి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పోశెట్టి, ఆర్డీవో అంబదాస్‌ రాజేశ్వర్‌, ఏసీపీ శ్రీనివాస్‌, మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట నారాయణ, పట్టణ సీఐ వీరయ్య, కేంద్రం నిర్వహకులు సద్మాసింగ్‌, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రైలు నుంచి దూకి.. శవమై తేలి



రెడ్డి రవి(ఫైల్‌)

బషీరాబాద్‌: దైవ దర్శనానికి వెళ్లిన ఓ కుటుంబం గమ్యం చేరకుండానే మార్గమధ్యలోనే విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన రెడ్డి రవి(41), హేమ భార్యాభర్తలు. ఈ నెల 18న తన కుమారులు కేతన్‌ చౌదరి, కేహిత్‌ చౌదరితో కలిసి రైలులో తిరుపతికి వెళ్లారు. 20న శ్రీవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా వికారాబాద్‌ జిల్లాలోని నావంద్గీ(బషీరాబాద్‌) రైల్వే గేటు సమీపంలో రైలు నెమ్మదిగా వెళ్తున్న సమయంలో బోగీ నుంచి దూకి రవి అదృశ్యమయ్యాడు. ఇది గమనించిన హేమ తాండూరు రైల్వే స్టేషన్‌లో దిగి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వికారాబాద్‌ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. రైల్వే స్టేషన్‌కు 2 కిలోమీటర్ల దూరంలో అడవిలో కుళ్లిపోయిన మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరి బషీరాబాద్‌ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు హేమను పిలిపించగా.. తన భర్తేనని బోరున విలపించింది. రవి మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని బంధువులు, భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

చెరువులో దూకి ఆత్మహత్య

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలోని దామర చెరువులో షేక్‌ తన్ను(43) అనే వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. వివరాలు.. తన్ను మద్యానికి బానిసై పనీపాట లేకుండా తిరిగేవాడు. దీంతో అనారోగ్యానికి గురై జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని చెరువులోకి దూకాడు. వెంటనే చెరువులో దూకి బయటకు తీసిన ప్పటికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్‌

ఆర్మూర్‌టౌన్‌: ఆలూర్‌ మండల కేంద్రంలో మట్కా నిర్వాహకుడు అఖిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ. 1,300 నగదు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అల్లూరమ్మ ఆలయంలో చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): కేశాయిపేట సమీపంలోని అల్లూరమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి గర్భ గుడి తలుపు తాళం పగులగొట్టారు. దేవస్థానంలో ఏర్పాటు చేసిన హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న డబ్బులను అపహరించారు. ఉదయం ఆలయానికి వెళ్లిన కమిటీ సభ్యులు చోరీ జరిగిన విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రతి వారం హుండీ డబ్బులు లెక్కించేవారు. ఈ సారి రెండు వారాలుగా హుండీని తెరవకపోవడంతో నగదు ఎక్కువగానే చోరీకి గురైనట్లు వారు పేర్కొన్నారు.

కాపర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ చోరీ

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌, నందిగామ గ్రామాల శివారులోని ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియ ని దుండగులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. నాళేశ్వర్‌లో నాలుగు, నందిగామలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ని పగలగొట్టి అందులో ఉన్న కాపర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. అధికారుల ఫిర్యాదు మేరకు నార్త్‌ రూరల్‌ సీఐ సతీష్‌, నవీపేట ఎస్సై వినయ్‌ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి కేసు నమోదు చేశారు.

పశువుల పాక నుంచి మూడు గేదెలు..

రుద్రూర్‌: కోటగిరి మండలం ఎత్తొండలో అగ్గు లింగయ్యకు చెందిన మూడు గేదెలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. లింగయ్య తన పశువుల పాకలో ప్రతి రోజులాగే గేదెలను కట్టేశాడు. గురువారం ఉదయం వెళ్లి చూసే సరికి అవి కన్పించలేదు. గ్రామంలో వెతికినా దొరక్కపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): సోమర్యాగడి తండాకు చెందిన మంజుల(35) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్‌ గురువారం తెలిపారు. మంజుల వారం రోజుల క్రితం రాఖీ పండుగకు తల్లిగారింటికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లిందని.. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించడం లేదని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అద్దె కారులో మేకల అపహరణ

ఖలీల్‌వాడి: నలుగురు యువకులు కారును అద్దెకు తీసుకొని మేకలను దొంగతనం చేసినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు గురువారం తెలిపారు. వివరాలు..బుధవారం రాత్రి మిర్చికంపౌండ్‌లోని మేకల కొట్టం వద్దకు కారులో వచ్చిన నలుగురు యువకులు మేకలను కారులో ఎత్తుకెళ్లారు. గురువారం మేకల యాజమాని కొట్టాల వద్దకు వచ్చి చూసేసరికి మేకలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడి సీసీ టీవీలను పరిశీలించి కారు వివరాలను కనిపెట్టారు. కారును ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. కారును అద్దెకు ఇచ్చానని పోలీసులకు కారు యాజమాని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్‌ పోలీసులు తెలిపారు.

మద్యం తాగించి హత్యకు ప్రయత్నం

- నస్రుల్లాబాద్‌ అటవీ ప్రాంతంలో ఘటన
- తీవ్ర గాయాల్లై రోడ్డుపై పడి ఉన్న యువకుడ్ని 108లో ఆస్పత్రికి పంపిన స్థానికులు
- బాన్సువాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు



వాహనదారులకు గోడు చెబుతున్న బాధితుడు

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మద్యం తాగించి యువకుడిని చంపేందుకు ప్రయత్నించిన ఘటన నస్రుల్లాబాద్‌ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. బాధితుడు(బాన్సువాడ మండలం కొల్లూర్‌ గ్రామస్తుడు) చించెల్లి ఆంజనేయులు తెలిపిన వివరాలు.. ఆంజనేయులు బాన్సువాడ పట్టణ ప్రాంతానికి దగ్గరలో పంట పొలం వద్ద ఉండగా కొల్లూర్‌ గ్రామానికి చెందిన బర్ల ప్రవీణ్‌.. వరిన్లో మేస్త్రీ వద్ద డబ్బులు రావాల్సి ఉన్నాయని వెళ్లి వద్దామని ఫోన్‌ చేశాడు. దీంతో ఆంజనేయులు తన బైక్‌పై నస్రుల్లాబాద్‌ వరకు ఒంటరిగా వచ్చాడు. అప్పటికే ప్రవీణ్‌తో పాటు మరొకరు బైక్‌పై నస్రుల్లాబాద్‌లో సిద్ధంగా ఉన్నారు. మా బండికి పేపర్లు లేవని.. నీ బండిపై వెళ్దామని ఆంజనేయులుకు ప్రవీణ్‌ చెప్పాడు. మార్గమధ్యంలో మద్యం సేవించి వెళ్దామని ఆంజనేయులుకు ఇద్దరూ చెప్పి బీర్లు తెచ్చుకున్నారు. నస్రుల్లాబాద్‌ అటవీ ప్రాంతంలో ముగ్గురూ కలిసి తాగారు. ఒక బీరు తాగిన తర్వాత ఆంజనేయులు తాను ఇంటికి వెళ్తానని మిగతా ఇద్దరికీ చెప్పడంతో.. ఎక్కడికి వెళ్తావ్‌ అంటూ విచక్షణారహితంగా కొట్టి నోట్లో ఏదో పసరు పోశారు..అనంతరం బ్లేడ్‌తో కోశారు. భయభ్రాంతులకు గురైన ఆంజనేయులు వారి నుంచి తప్పించుకుని బాన్సువాడ –వర్ని ప్రధాన రహదారిపైకి వచ్చాడు. స్థానికుల సహాయంతో 108 వాహనంలో బాన్సువాడ ఆస్పత్రిలో చేరాడు. ఈ విషయం గురించి బాధితుడు ఫిర్యాదు చేయడంతో బాన్సువాడ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ సీజ్‌



రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పొతంగల్‌ శివారులో వీరభద్ర మందిరం వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం సాయంత్రం సీజ్‌ చేసినట్లు తహసీల్దార్‌ మల్లయ్య తెలిపారు. డంప్‌లోని ఇసుక సుమారు 15 ట్రాక్టర్లు ఉంటుందని తెలిపారు. ఇసుకను అక్రమంగా డంప్‌ చేస్తే విచారణ చేసి వాహనాన్ని సీజ్‌ చేయడంతో పాటు బాధ్యులపై కేసు నమోదు చేస్తామని తహసీల్దార్‌ హెచ్చరించారు.

ఆస్తి కోసం తన్నుకున్నారు

- ఇటుకలు, కర్రలతో పరస్పర దాడులు చేసుకున్న అన్నదమ్ముల కుటుంబాలు
- ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



గాయాలపాలైన నాగమణి, బాన్సువాడలో చికిత్స పొందుతున్న శంకర్‌ కుటుంబ సభ్యులు

బాన్సువాడ: ఆస్తి కోసం అన్నదమ్ముల కుటుంబాలు ఘర్షణ పడటంతో ఆరుగురికి గాయాలయ్యాయి.. అందులో ఇరువురి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన బీర్కూర్‌ మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. బీర్కూర్‌కు చెందిన మంగలి శంకర్‌, మంగలి మాధవ్‌ ఇద్దరు అన్నదమ్ములు. కొన్నేళ్లుగా ఇరువురు వేర్వేరుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. పది రోజుల క్రితం వీరి తల్లి నర్సవ్వ చనిపోయింది. తల్లి చావు ఖర్చులు, ఆస్తి విషయంలో శంకర్‌, మాధవ్‌ల మధ్య ఘర్షణ మొదలైంది. ఇరుకుటుంబ సభ్యులు పరస్పర దాడులకు పాల్పడడంతో శంకర్‌ కుమారుడైన బాబులాల్‌ తన చిన్నానాన్న మాధవ్‌ను నెట్టడడంతో కింద పడ్డాడు. ఆ తర్వాత ఇరు కుటుంబ సభ్యులందరూ ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ దాడుల్లో మాధవ్‌కు, ఆయన భార్య నాగమణికి తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయి. నాగమణి అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ దాడిని చూసి మాధవ్‌ కుమారుడు రామ్‌ భయంతో అక్కడి నుంచి పారిపోయాడు.

గమనించిన స్థానికులు మాధవ్‌ను, నాగమణిని బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. మాధవ్‌, నాగమణిల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. స్వల్ప గాయాలైన శంకర్‌, ఆయన కుమారుడు బాబులాల్‌, కుమార్తె, కోడలు బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

ఘన్‌పూర్‌లో దారుణహత్య



బట్టు కృష్ణ(ఫైల్‌)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, సీఐలు

నిజామాబాద్‌ రూరల్‌: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో బుధవారం రాత్రి బట్టు కృష్ణ (25) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కల్లు కంపౌండ్‌ ముందు ఉన్న హెచ్‌పీ చికెన్‌ సెంటర్‌ వద్ద కృష్ణ మృతి చెంది ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వీపులో పదునైన ఆయుధంతో పొడిచినట్లుగా.. మూడు గాయాలు ఉన్నట్లుగా గుర్తించారు. ఘటనా స్థలంలో డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. కృష్ణ భార్య కొన్ని సంవత్సరాల కిందట వదిలివెళ్లిపోయింది. ప్రస్తుతం ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వ్యక్తిగత కక్షలతో హత్య జరిగి ఉండవచ్చని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేష్‌, ఎస్సై మహమ్మద్‌ షరీఫ్‌ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



రాజశేఖర్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: రోడ్డు దాటుతున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన నెల్లూరి రాజశేఖర్‌ (28) మృతిచెందారు. రాజు అనే మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. రాజును ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

బోధన్‌: ఎడపల్లి మండలంలోని జాన్కంపేటలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందినట్లు ఎస్సై వంశీచందర్‌ రెడ్డి తెలిపారు. గ్రామంలో రోడ్డు ప్రక్కన పడి ఉండటంతో స్థానికులు, పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు వెళ్లి పరిశీలించి వృద్ధుడు మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని బోధన్‌ జిల్లా ప్రభుత్వాస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మృతుడి బంధువులెవరైనా గుర్తు పట్టినట్లయితే 87126 59873, 87126 59780 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

రామారెడ్డి: ఎల్లంపేట గ్రామానికి చెందిన భూక్య శంకర్‌(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. శంకర్‌ భార్య రెండు రోజుల క్రితం గొడవపడి తల్లి గారి ఇల్లు అన్నారం గ్రామానికి వచ్చింది. శంకర్‌ తన భార్య కోసం బుధవారం అన్నారం గ్రామానికి వెళ్లాడు. గురువారం అన్నారం గ్రామ శివారులోని కల్వర్టు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి అన్న భూక్య రవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు.

డయల్‌ 100 దుర్వినియోగం.. వ్యక్తికి జైలు శిక్ష



ఖలీల్‌వాడి: మద్యం సేవించి డయల్‌ 100ను మిస్‌ యూజ్‌(దుర్వినియోగం) చేసిన కావేటి నారాయణకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు నాలుగో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై శ్రీకాంత్‌ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. నగరంలోని పద్మానగర్‌ కాలనీకి చెందిన కావేటి నారాయణ తరుచూ మద్యం సేవించి కాలనీవాసులతో పాటు ఇతరులతో గొడవలకు దిగుతున్నట్లు చెప్పారు. మద్యం సేవించిన తర్వాత డయల్‌ 100కు ఫోన్‌ చేసి పోలీసులను ఇబ్బందులకు గురి చేయడంతో కేసు నమోదు చేసి రెండో మేజిస్ట్రేట్‌ వద్ద హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులు నమోదు

బిచ్కుంద(జుక్కల్‌): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులు నమోదు చేశామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌, గోపన్‌పల్లి చౌరస్తాలలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ నెలలో 42 డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

దురుసుగా ప్రవర్తించిన ఇద్దరికి రిమాండ్‌

వేల్పూర్‌: వెంకటాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి పెట్రోలింగ్‌ చేస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఆరేపల్లి అరవింద్‌, గైనిమీది జనార్దన్‌ యాదవ్‌లను గురువారం రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్సై నాగ్‌నాథ్‌ తెలిపారు. వివరాలు.. పోలీస్‌ పెట్రోలింగ్‌ పార్టీ వెంకటాపూర్‌ గ్రామం చేరుకునే సరికి కుకునూర్‌ గ్రామానికి చెందిన అరవింద్‌, వేల్పూర్‌కు చెందిన జనార్దన్‌, మరికొందరు వెంకటాపూర్‌లోని అరవింద్‌కు చెందిన డీజే షాపువద్ద గుమిగూడి ఉండగా పోలీసులు మందలించారు. ఆవేశంలో అరవింద్‌, జనార్దన్‌ ఇద్దరూ పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారు. దాంతో పెట్రోలింగ్‌ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించారు.

డీజే నిర్వాహకుల బైండోవర్‌



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి, కోమటిపల్లి, సజ్జన్‌పల్లి, గ్రామాలకు చెందిన నలుగురు డీజే నిర్వాహకులను గురువారం బైండోవర్‌ చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్‌ తెలిపారు. గణేష్‌ ఉత్సవాల్లో డీజేలు ఏర్పాటు చేయవద్దని ముందస్తుగా బైండోవర్‌ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గణేష్‌ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్‌, సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం రాత్రి కారులో తరలిస్తున్న గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ గురువారం తెలిపారు. కారులో 20 గుట్కా బ్యాగులు, నాందేడ్‌కు చెందిన అంకుష్‌ జాదలవార్‌, శివాజీ గైక్వాడ్‌ ఉన్నట్లు చెప్పారు.నగరంలో గుట్కాను తక్కువ ధరకు కొని నాందేడ్‌లో ఎక్కువ ధరకి అమ్మి లాభం గడించాలని ఉద్దేశంతో ఈ వ్యాపారం చేస్తున్నామని నిందితులు తెలిపారు. వీటి విలువ రూ. రూ.1.24లక్షలు ఉంటుదని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్‌ రూరల్‌: ఆకుల కొండూర్‌ శివారులో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ తెలిపారు. వివరాలు.. ఆకుల కొండూర్‌ గ్రామానికి చెందిన ప్రవీణ్‌ గురువారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రంలోని బోరుమోటర్‌ వద్దకు వెళ్లగా అక్కడ కుళ్లిపోయిన స్థితిలో శవం కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని ఆయన పోలీసులకు చేరవేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహం పురుషుడిగా గుర్తించామని, చనిపోయిన వ్యక్తికి 45 ఏళ్లు ఉంటాయని, వారం క్రితం చనిపోయి ఉండవచ్చని ఎస్‌హెచ్‌వో వివరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.